# నసమేళం!

సన్నాయిమేళం... బ్యాండ్‌మేళం... చెవిటిమేళం... చివరగా నసమేళం!

వేటినైనా భరించవచ్చునేమోగానీ... నసమేళం మాత్రం ప్రాణాంతకం! వాళ్ళు పెట్టే పోరు అంతా ఇంతా కాదు. నస పెట్టేవారికి ఆహ్లాదంగా వున్నా... ఎదుటివారికి మాత్రం బోర్‌గ తలనొప్పిగా అన్పిస్తుంది.

రామ్మూర్తిగారంటే అందరికీ భయమే! మనిషి రావణాసురుడులా కానీ రాక్షసుడిలా కానీ వుండడు. భూమికి నాలుగు అడుగుల ఎత్తు... నెత్తిన ఇత్తడి చెంబు బోర్లించినట్టు బాల్డ్ హెడ్... మీసాలు లేని మూతి... గోల్డ్ కవరింగ్ ఆభరణంలాగ ధగధగ మెరిసే శరీరఛాయ!

మనిషికి డెబ్బై ఏళ్ళొచ్చినా పిడిరాయిలాగ దృఢంగా ఆరోగ్యంగా... పొన్నకాయలా చలాకీగా వుంటాడు.

హాల్లో గల సోఫాలో కూర్చుని ఓ చేతిలో కాఫీ కప్పు... మరో చేతిలో న్యూస్‌పేపర్‌తో రామ్మూర్తి చాలా బిజీగా వున్నాడు.

ఎవరో అదేపనిగా కాలింగ్‌బెల్ నొక్కుతూ తన పేపర్ పఠనానికి అంతరాయం కలిగినందుకు చింతిస్తూ... విసుగు ప్రదర్శిస్తూ... చేతిలో సగం తాగిన కాఫీ కప్పు ఎదురుగా వున్న టీపాయ్ మీదుంచి... పేపరు విసిరికొట్టి... లేచొచ్చి వీధి వాకిలి బార్లగా తీసాడు.

ఎదురుగా ఓ నడివయసు మహిళ! ఆమెలో అందం... శరీరంలో సొంపులూ చూచి మనసులోనే లొట్టలేసుకున్నాడు.

రామ్మూర్తి చూపులు ఆవిడగారి మెడ తడిమింది. బోసిగా అవుపించింది. ఆ చూపులు కిందికొచ్చి పాదాలను తాకినయ్. కాలికి మట్టెలూ లేవు. అంటే... విడో అయి వుండాలి... లేదూ ఇన్నేళ్ళొచ్చినా పెళ్ళి పెటాకులూ లేని ఆడదై వుండాలి అని తలపోశాడు.

ఈమె ఎవరై వుండచ్చు? తనకు పరిచయమున్న మనిషిలాలేదు. చూపులకు పనిమనిషిలా అవుపించటంలేదు.

పోనీ ముష్టికేమైనా వచ్చిందా అనుకుంటే తనను చూచి స్థాణువులా నిల్చుండిపోయింది. నోరు మెదపటంలేదు... మరైతే ఎవరై వుండాలీ... అనేసి నెత్తిన జుట్టులేని బుర్ర గోక్కున్నాడు.

'బెల్ కొట్టింది... నువ్వేనా?... కాదు... మీరేనా?...' తడబడ్డాడు.

'రామ్మూర్తిగారిల్లు ఇదేనాండీ...?' కళ్ళు పెద్దవి చేస్తూ అడిగిందామె.

పేరుపెట్టి వాకబు చేస్తున్నదీ అంటే... పూర్వాశ్రమంలో తన ప్రియురాలు అయివుండటానికి ఖచ్చితంగా వీల్లేదు.

'అవున్నేనే' ఇబ్బందిగా జవాబిచ్చాను.

'మీతో నేపనుండి వచ్చాను... లోపలికి రావచ్చా...?' అంటూనే అనుమతికోసం వేచి వుండకుండా లోనికి నాలుగడుగులేసింది.

అమ్మ ఈవిడగారి తొందరపాటైపోనూ... అనుకున్నాడు. హవ్వ! తనతోపనా?... ఆమెది నడివయసు... తనకేమో డెబ్భై.. ఇదెక్కడి కాంబినేషన్?

నాతో పని వుంది అంటుందంటే... అదే బాపతు పనై వుండనోపు...? ఇలాంటి అపభ్రంశపుమాట అన్నందుకు ఆమె నాలుక పట్కార్‌తో బైటికి లాగి... పదునులేని కత్తితో కోసేయాలన్నంత కోపమొచ్చింది రామ్మూర్తికి.

తానొకవేళ తొందరపడి ఏదైనా కొంటెపని చేసి వుండి వున్నట్టయితే... అపరకాళిలా ఆమె తనమీదికి లంఘించి... సంహరించి వుండేది.

తనకు రెట్టింపు పర్సనాలిటీ ఆమెదాయె?... కొంచెం జాగ్రత్తగా... వళ్ళు దగ్గరుంచుకుని సంభాషించటం సర్వదా శ్రేయస్కరంగా తోచింది.

ఆవిడో... నేనో...ఇద్దరిలో ఎవరో ఒకరం అదృష్టవంతులం... కాబట్టే ఇరువురి మధ్యా ముష్టియుద్ధం చోటు చేసుకోలేదు. థాంక్‌గాడ్... అనుకున్నాడు మనసులో...

శ్రీమతి చనిపోయి పదేళ్ళు కావస్తున్నా... ఆమె స్ఫురణకొచ్చినా రాకున్నా మరో ఆడదాన్ని... ఐమీన్ పరాయి స్త్రీని కన్నెత్తైనా చూడని శ్రీరామచంద్రుడు తాను.

కానీ... ఇప్పుడీమెను చూచేక మనసు చలించి... కన్ను చెదిరినట్టనిపంచింది రామ్మూర్తికి!

చిత్తచాపల్యం... అని సరిపెట్టుకున్నాడు.

రాక్షసిలాంటి పెళ్ళాన్ని ఆ దేవుడు లాక్కెళ్ళాడు కాబట్టి సరిపోయింది. ఈ పదేళ్ళూ కాస్తంత మనశ్శాంతితో బతికిపోతున్నాడు. లేకుంటే... శ్రీమతి తనని ఏనాడో భూస్థాపితం చేసి వుండేది.

నిద్రలో గుండె ఆగి 'హరీ' అంది. తన నెత్తిన చచ్చిపాలు పోసింది!

దాని నోటికసలు అద్దూ ఆపే వుండేదా? నోటికి ఎంత మాటొస్తే అంతమాట అనేసి తిట్ల పురాణం చదివేది. అన్నేళ్ల కాపురంలో తనకు మనశ్శాంతి లేకుండా చేసింది రాక్షసి!

ఇన్నేళ్లుగా భర్తతో కాపురం చేసిన భార్య ఈయన పెట్టే నసకి నరకయాతన అనుభవించి మనశ్శాంతి కరువై... కన్ను మూసిందని లోకులు కావుకావుమన్నారు.

రామ్మూర్తిగారేమో భార్య గయ్యాళిగంప... బ్రహ్మరాక్షసి...అందుకే ఆ దేవుడు ఆమెను త్వరగా తీసుకెళ్లాడనే కౌంటర్ ప్రచారాన్ని అయినవారికి కాని వారికీ విన్పించాడు.

అఫ్‌కోర్స్ ఇప్పుడు అనుభవిస్తున్న ఆస్తీ సంపదా అంతా భార్య పుట్టింటివారు ఆమె పరంచేసిందేననుకోండి! అయినా తన కష్టార్జితమూ లేకపోలేదు.

తన సర్వీసులో ఏ 'స్కాము'లోనూ ఇరుక్కోకుండా గౌరవప్రదంగా రిటైరై ఓ కోటిరూపాయలు వెనకేసుకోగలిగాడు.

ఎంత అదృష్టం?... మగపిల్లలిద్దరూ అమెరికాలో సెటిలైనారు. ఆడ సంతానం 'నిల్'!

ప్రస్తుతం రామ్మూర్తిగారికొచ్చిన బెంగేంలేదు. కాకుంటే... అంతపెద్ద బంగళాలో ఒక్కడూ వుండాల్సి రావటంతో తోడుకోసం వెంపర్లాడుతున్నాడు. అంతే!

పనివాళ్ళని నమ్మడు. మంచిగా నటిస్తూ ఏ అర్ధరాత్రో తన గొంతు పిసికి వున్నది కాస్తా పట్టుకుపోతారేమోనే భయం! నెలజీతానికి పెట్టుకున్న ఏ వక్క వంటమనిషీ పట్టుమని పదిరోజులు చేయకుండానే... ఈయనగారి నస భరించలేక మానేస్తుంది.

పప్పులో పోపెంత పెట్టాలి?... వేపుడు కూరలో నూనెంత వాడాలి?... పొయ్యిమీద కెక్కించేముందు బియ్యాన్ని ఎన్నిసార్లు కడగాలి?... శుభ్రంగా కాయగూరలు కడిగి ఎలా తరగాలి?... కందిపచ్చడి ఎంత మెత్తగా రుబ్బాలి?... పులుసులోకి ములక్కాడ ముక్కలు ఎంత సైజులో తరగాలి?... అంటూ వంటావిడ వెంట వంటింట్లో తిరుగుతూ నసపెట్టటం రామ్మూర్తి అలవాటు.

ఈయనగారి నసమేళం తట్టుకుని భరించలేక వీధి... వాకిలినుంచి వచ్చిన వంటవాళ్ళు దొడ్డివాకిలిన వెళ్ళిపోతూ వుంటారు.

మళ్ళీ మనిషి పిసినారేం కాదు. అడిగినంత జీతం ఇస్తాడు. అడక్కుండానే ఏవేవో చాలా ఇవ్వాలని తాపత్రయపడే స్వభావం!

అయినా ఆయన మంచి పనివాళ్ళకి అక్కరకు రావటంలేదు. అదే ఆయనగారి బాధ!

అంచేత... ఈ వయసులోనూ స్వయంపాకం తప్పనందుకు ఓ... తెగబాధపడిపోతుంటాడు.

మనిషికి రోగం రొష్టులేదు. మందు మాకూ అలవాటులేదు. ధూమపానానికి ఆమడదూరం! క్లబ్బుకి వెళ్ళటాలు... పేకాట ఆడటంవంటి దుర్గుణాల్లేని అదృష్టవంతుడు రామ్మూర్తి!

ఈయనగారికి తగిన జోడీ... అదే... వంటావిడే దొరక్కుండా వుంది. అథవా దొరికినా అర్థంచేసుకు సహకరిస్తూ ఇంతవుడకేసి పడేసే మనస్తత్వంగల ఆడది దొరకటం దుర్లభమైంది.

ఇంటిపేరు పప్పువారు! (కందిపప్పో... పెసరపప్పో వివరాలొద్దు). ఈ వయసులోనూ

ముద్దపప్పు ముద్ద ముద్దకీ వుండాల్సిందే! ఇనుపగుళ్ళను సైతం కరకరా నమిలిమింగి హరాయించుకోగల జీర్ణశక్తి కలవాడు.

'సార్!... మీ గురించి విన్నాను...' వచ్చినావిడ అనటంతో గతస్మృతులనుంచి తేరుకున్నాడు రామ్మూర్తి.

ఏమిటీమె ధోరణి?... నా గురించి విన్నానంటుందేమిటీ? ఏం వినుంటుంది?... బేడ్‌గానా?... గుడ్‌గానా?... అనేసి కంగారుపడ్డాడు.

'అదేనండీ... మీ పనిమనిషి రత్తాలు చెప్పింది...'

పైగా అది చెప్పిందంటుందేమిటి? ఆ ముసల్ది తనగురించి ఏం చెప్పివుంటుందో బోధపడ్లేదు ఓ పట్టాన.

తనవేపు ఈవిడగారు అలా చూస్తుందేమిటి... సినిమా హీరోయిన్‌కు మల్లే కసికసిగా?... అవి ఏరకమైన చూపులో అర్థంకాలేదు.

'రత్తాలు ఏమని చెప్పిందేమిటి...?' గొంతు పెగుల్చు కొచ్చినయ్ మాటలు.

'మిమ్మల్ని ఓసారి కలవమంది...'

'అయ్యో బాబోయ్!... కలవటమా?... నన్నా... ఎందుకుట...' గబగబా సవాలక్ష ప్రశ్నలు కురిపించాడు. ఈ మాటలే కనుక బ్రతికి వుండి మా ఆవిడ విన్నట్టయితే... సున్నంలోకి ఎముకలేకుండా చితక్కొట్టి... చెవులు మూసేది. అమాంతం మీదపడి గోళ్లతో రక్కి పూతకిలా ముష్టియుద్ధానికి తలపడేది.

పాపం... చచ్చి ఏలోకాన వుందో?...

టి.వి. సీరియల్లో లాగ అర్థంకాని సంభాషణలతో సాగదీస్తోందేగాని... అసలామె ఎవరో? ఎందుకొచ్చిందో వివరంగా చెప్పనందుకు మనసులో తర్జన భర్జన పడుతున్నాడు.

'నా పేరు విజయలక్ష్మి! బ్రాహ్మణవీధిలో మా ఇల్లు! మీరు వంటమనిషి కావాలన్నారట కదా?!... అందుకే వచ్చాను...' సిగ్గు అభినయిస్తూ... మనిషి నడివయసులోనూ మెలికలు తిరుగుతూ అసలు విషయం చెప్పి సస్పెన్స్‌కి తెరదించింది.

పేపర్లో... టి.వి.ల్లో ప్రకటనలిచ్చినా వంట మనుషులు దొరకని ఈ రోజుల్లో గుమ్మంలో కొచ్చి... తలుపు తట్టి వంటచేసి పెడతానంటున్న విజయలక్ష్మి ధోరణికి విస్తుపోయాడు.

ఇప్పుడు రామ్మూర్తి మనసు ఆకాశమంత నిర్మలంగా వుంది. పుష్పకవిమానం మెక్కి మబ్బుల్లో పయనిస్తున్నంత సంబరంగా వుంది. ఈవిడగారొచ్చి తననెత్తిన పాలు పొయ్య బోతోందన్న మాట! తన వంటింటి కష్టాలు అటకెక్కబోతున్నాయన్నమాట!

ఆలోచనలు... అనుమానాలు మాని... ఇక ఆమెతో నిర్భయంగా మాట్లాడవచ్చనుకున్నాడు.

'ఇంత పెద్ద బంగళాలో... మీరు సింగ్లరా? ఫ్లూరలా?'

ఆమెకి ఇంగ్లీషు కూడా వచ్చన్నమాట!...

అంటే ఏమిటన్నట్టు క్వశ్చన్ మార్కు ముఖం పెట్టాడు రామ్మూర్తి అమాయకత్వం నటిస్తూ...

'అదే సార్!... మీరు ఒక్కరేనా... ఇంకా ఫ్యామిలీ మెంబర్స్ ఎవరైనా వున్నారాని?... వంట ఎంతమందికి చేసిపెట్టాలో నాకు తెలియాలి కదా... నిలబడి నిలబడీ కాళ్ళు పీకుతున్నాయో ఏమో నా పర్మిషన్ లేకుండానే స్వతంత్రించి అక్కడున్న సోఫాలో కూలబడింది విజయలక్ష్మి.

ఓసి దీని చొరవ పాడుగానూ... ఏనుగంత మనిషిని కాకపోయినా ఇంటి యజమానినై వున్న తానే నిలబడివుంటే... ఆమె కూర్చున్నందుకు అవాక్కయ్యాడు.

విజయలక్ష్మమ్మ తల్లి డబుల్ మీనింగ్ డైలాగులు మాట్లాడడం రామ్మూర్తిని కలవరపెట్టింది.

'అవునూ... అన్ని ప్రశ్నలు నన్నే అడగటం తప్పించి... మీ గురించి చెప్పనేలేదు. మీరు మేరీడా? మీ హజ్బెండ్ ఏం చేస్తుంటాడు?... పిల్లలెందరు?...' టకటక ఇంటర్వ్యూలో కేండిడేట్‌ని ప్రశ్నలు అడిగినట్టు అడిగేసాడు.

'మాకు పిల్లల్లేరు. వారు ఈ మధ్యనే ఎన్‌కౌంటర్లో పోయారు. తీవ్రవాది అనుకుని అమాయకుడైన నా భర్తని పొట్టన పెట్టుకుని నన్ను దిక్కులేనిదాన్ని చేసారు. గౌరవంగా బతికినదాన్ని... చివరికి... ఎన్నడూ ఊహించని రీతిగ... పరాయి ఇళ్లలో చాకిరీ చేసి పొట్టపోసుకోవలసి వచ్చింది...' అంటూ చిర్రున చీది పైట కొంగుతో కళ్ళొత్తుకుంది.

ఆమె మాటలకి రామ్మూర్తి బుర్ర వేడెక్కింది!

'మీరు నా పరిస్థితి అర్థం చేసుకుని కాస్తంత కరుణించి... మీ పంచన చోటిస్తే...' చెప్తూ ఆగింది.

మయసభ సీన్‌లో దుర్యోధన సార్వభౌముడిలా అంతంత పెద్దపెద్ద డైలాగ్స్ విజయలక్ష్మి చెప్తూంటే రామ్మూర్తి నోరెళ్లబెట్టాడు. ఈమె గడుసుదే మొత్తానికి! సూదిలా వచ్చి దబ్బనమై కూర్చోటం ఖాయం అన్పించకపోలేదు.

అమ్మో...! ఈవిడ జాణే... అనుకున్నాడు.

'చూడండి కనకమహాలక్ష్మిగారూ...' ఏదో చెప్పబోయాడు.

'ఛీపాడు! నన్ను గారూ అనకండి. మీకంటే ఎంతో చిన్నదాన్ని... నాపేరు కనకమహాలక్ష్మి

కాదుసార్... విజయలక్ష్మిని...' పైట సరిచేసుకుంటూ అంది.

ఆమె ఓవర్ డోస్ అభినయానికి రామ్మూర్తి డీలాపడ్డాడు.

అంతలోనే తెప్పరిల్లుకుని 'వంటంటూ పెద్దగా ఏమీ వుండదు. బ్రేక్‌ఫాస్ట్‌లో రోజూ ఇడ్లీ తప్పనిసరి! మధ్యాహ్నం లంచ్‌కి... ముద్దపప్పు... పులుసు... కాసిన్ని అప్పడాలు... వడియాలు... ఊరుమిరపకాయలు... ఒకవేపుడు... ఒక రోటి చట్నీ... వుంటే చాలు! మధ్యాహ్నం... కాసిని పకోడీలో... బజ్జీలో... ఏవోటి వుండాలి!... ఇకపోతే రాత్రి విషయానికొస్తే... కాసిని పుల్కాలు... అందులోకి తోటకూరగాని... పాలకూరగాని... వుల్లిగడ్డతో వుడికించి తాలింపు పెట్టిన కూర... పెరుగు సరిపోతాయ్!... ఇదీ క్లుప్తంగా ఈ ఇంట్లో వంట...' సంక్షిప్తంగా చెప్పాడు.

'మీకు అభ్యంతరం లేకపోతే... నేనూ మీతోనే వుండిపోతాను. మీరు తప్ప నాకు దిక్కెవరున్నారు?...' తన నిర్ణయమేమిటో వివరించింది.

'రాత్రిళ్ళు టి.వి. తొమ్మిదికల్లా కట్టేస్తాను. ఆపైన పడకసీను...' విజయలక్ష్మి ముఖంలోకి కొంటెగా చూశాడు.

'అదేదో మిడ్‌నైట్ మసాలా అంటారే... ఆ ప్రోగ్రాం మీరు చూడరా?... ఛీ పాడు... నేనూ చూడను...' ముఖాన్ని దోసిట్లో దాచుకుంది.

మొత్తానికి గొప్ప టేస్టున్న మనిషే... అనుకున్నాడు రామ్మూర్తి.

విజయలక్ష్మి తనకు పిచ్చపిచ్చగా నచ్చేసింది...! కానీ అంతలోనే భయం ఆవహించింది.

ఈమె మాత్రం తన నస భరిస్తూ ఎన్నాళ్ళుండబోతోందో?... విజయలక్ష్మి కూడా వారం తిరక్కుండానే వుడాయిస్తే...???

- సమాప్తం -